ఎడిటర్ :
మంచె శరత్ చంద్ర

సంపుటి : 13
సంచిక : 305

పేజీలు : 5 వెల రూ. 2/-

ఆదివారం
08 మార్చి 2026

PUBLISHED FROM :
HYDERABAD

AM న్యూస్
ప్రతిదినం ప్రత్యేకం
www.amnews7.com


## నేడు భారత్, న్యూజిలాండ్ తుది పోరు

- టైటిల్‌పై కన్నేసిన ఇరు జట్లు - టీ20 ప్రపంచ కప్ టోర్నీ




2 లో

# తెలంగాణ పునర్నిర్మాణంలో భాగస్వాములు కండి

లొంగిపోయిన మావోయిస్టులకు సీఎం రేవంత్‌రెడ్డి పిలుపు

మీరు లేవనెత్తే అంశాలపై ఎప్పుడైనా చర్చించేందుకు సిద్ధమని వెల్లడి

గణపతి లొంగిపోతే రక్షణ బాధ్యత తమదేనని భరోసా

ముఖ్యమంత్రి సమక్షంలో 130 మంది లొంగుబాటు

ఏకంగా 124 ఆయుధాల అప్పగింత

2 లో




# ఇరాన్-అమెరికా.. ఢీ అంటే ఢీ!

ఇరాన్‌పై 80 ఫైటర్ జెట్లతో ఇజ్రాయెల్ భీకర దాడులు

అమెరికా థాడ్ రాడార్ సిస్టమ్‌ను పేల్చేసిన ఇరాన్ సైన్యం

గల్ఫ్ దేశాలకు ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ క్షమాపణలు

ప్రత్యక్ష దాడికి దిగితే మాత్రం ఊరుకోబోమని హెచ్చరిక

ఎట్టకేలకు ఇరాన్ తోక ముడిచిందంటూ ట్రంప్ ఎద్దేవా

హెర్మూజ్ జలసంధి విషయంలో పేలిన మాటల తూటాలు

జలసంధి గుండా ప్రయాణిస్తే పేల్చేస్తామని ఇరాన్ వార్నింగ్

నౌకలకు భద్రత కల్పిస్తామంటూ భరోసా ఇచ్చిన అమెరికా

యూఎస్ బలగాల కోసం నిరీక్షణ అంటూ ఇరాన్ కౌంటర్



2 లో

# ఆడబిడ్డలకు కేసీఆర్ ఆదరణ.. చట్టసభల్లో మహిళా ప్రాతినిధ్యం పెరుగాలి : కేటీఆర్

- ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా సాగాలి
- చట్టసభల్లో మహిళా ప్రాతినిధ్యం పెరుగాలి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- నేడు తెలంగాణ భవన్‌లో మహిళాదినోత్సవం

2 లో



# అంతర్జాతీయ మహిళా దినోత్సవం.. సిలికాన్ ల్యాబ్స్, వెల్ఫేర్ ఫౌండేషన్ కలిసి 100కి పైగా మహిళా సఫాయి

**ఏ ఎం న్యూస్, ఓయూ:**
అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా, సిలికాన్ ల్యాబ్స్ జూ= నిధులతో సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ (జవీజ) సహకారంతో అనుభూతి వెల్ఫేర్ ఫౌండేషన్ హైదరాబాద్‌లో 100కి పైగా మహిళా సఫాయి మిత్రుల కోసం ప్రత్యేక సాధికారత కార్యక్రమాన్ని మార్చి 7, 2026న నిర్వహించింది. ఈ కార్యక్రమం మహిళా శుభ్రత కార్మికుల శక్తి, అంకితభావం మరియు నగర శుభ్రతలో వారి అమూల్యమైన సేవలను గౌరవిస్తూ నిర్వహించబడింది. మహిళల భద్రత, గౌరవం మరియు వారి నైపుణ్యాల అభివృద్ధిపై పెట్టుబడి పెట్టడం ద్వారా కుటుంబాలు, సమాజాలు మరియు మొత్తం నగర అభివృద్ధికి దీర్ఘకాలిక ప్రయోజనాలు కలుగుతాయని ఈ కార్యక్రమం సందేశాన్ని అందించింది. ఈ కార్యక్రమం మహిళా సఫాయి మిత్రులకు భద్రతతో కూడిన పని వాతావరణాన్ని కల్పించడం మరియు బాధ్యతాయుతమైన వ్యర్థ నిర్వహణపై అవగాహన పెంపొందించడం లక్ష్యంగా నిర్వహించబడింది. హైదరాబాద్ నగర శుభ్రత మరియు ప్రజా ఆరోగ్యాన్ని కాపాడటంలో వారు ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా 100కి పైగా మహిళా సఫాయి మిత్రులకు భద్రతా బూట్లు అందజేసి, చెత్తను సురక్షితంగా సేకరించడం మరియు సరైన విధంగా నిర్వహించడం పై అవగాహన కల్పించారు. దీని ద్వారా పనిలో ప్రమాదాలను తగ్గించడం మరియు రోజువారీ భద్రతను మెరుగుపరచడం లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ కార్యక్రమానికి సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ నర్సింగి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ టి. కృష్ణ మోహన్ రెడ్డి గారు మరియు నర్సింగి సర్కిల్ మునిసిపల్ హెల్త్ ఆఫీసర్ డా. కె.ఎస్. రవి గారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా టి. కృష్ణ మోహన్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్, నర్సింగి సర్కిల్, సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ మాట్లాడుతూ, "ఇలాంటి సహకార కార్యక్రమాలు పారిశుద్ధ్య వ్యవస్థను బలోపేతం చేయడంలో మరియు సమాజం కోసం కష్టపడుతున్న మా మహిళా సఫాయి మిత్రుల సంక్షేమాన్ని మెరుగుపరచడంలో ఎంతో ముఖ్యమైనవి" అని తెలిపారు. ఈ కార్యక్రమం గురించి ఇలా జోసెఫ్, హెడ్ -- ప్రాజెక్ట్స్, అనుభూతి వెల్ఫేర్ ఫౌండేషన్ మాట్లాడుతూ, "మహిళా సఫాయి మిత్రులు మన పారిశుద్ధ్య వ్యవస్థకు బలమైన ఆధారం. అయినప్పటికీ వారి ఆరోగ్యం మరియు భద్రత అవసరాలు చాలా సార్లు గుర్తింపు పొందవు. ఈ కార్యక్రమం ద్వారా వారికి అవసరమైన భద్రతా పరికరాలు అందించడం, చెత్తను సురక్షితంగా నిర్వహించే విధానాలపై అవగాహన కల్పించడం మరియు మన నగరాలను పరిశుభ్రంగా ఉంచడంలో వారి అమూల్యమైన సేవలను గౌరవించడం మా లక్ష్యం" అని అన్నారు. కార్యక్రమం చివరలో మహిళా సఫాయి మిత్రుల ఉత్సాహాన్ని ప్రోత్సహించేందుకు క్రీడా మరియు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి వారి సేవలను గౌరవించారు. ఈ సామాజిక కార్యక్రమం "సఫాయి మిత్ర సార్థక్" అనే విస్తృత కార్యక్రమంలో భాగంగా, సిలికాన్ ల్యాబ్స్ CSR మద్దతుతో అనుభూతి వెల్ఫేర్ ఫౌండేషన్ అమలు చేస్తోంది. ఈ కార్యక్రమం ద్వారా పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్యం, భద్రత, గౌరవాన్ని మెరుగు పరచడం మాత్రమే కాకుండా, పట్టణ ప్రాంతాల్లో స్థిరమైన వ్యర్థ నిర్వహణ పద్ధతులను ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకున్నారు.



**అనుభూతి వెల్ఫేర్ ఫౌండేషన్ గురించి..** అనుభూతి వెల్ఫేర్ ఫౌండేషన్ భారతదేశంలో పర్యావరణ పరిరక్షణ, సామాజిక సమగ్రత మరియు స్థిరమైన వ్యర్థ నిర్వహణ వ్యవస్థలను ప్రోత్సహించడానికి కట్టుబడి ఉన్న ఒక లాభాపేక్షలేని సంస్థ. ఘన వ్యర్థ నిర్వహణ మరియు ప్రవర్తనా మార్పు కార్యక్రమాల ద్వారా అనుభూతి వెల్ఫేర్ ఫౌండేషన్ సర్క్యులర్ ఎకానమీ నిర్మాణానికి తోడ్పడుతూ, వ్యర్థ కార్మికులను శక్తివంతం చేసి సమాజాల్లో దీర్ఘకాలిక ప్రభావాన్ని సృష్టిస్తోంది.

# తెలంగాణ పునర్నిర్మాణంలో భాగస్వాములు కండి



**హైదరాబాద్:**
మావోయిస్టుల అగ్రనేత గణపతి లొంగిపోతే ఆయన ఆరోగ్యం, రక్షణ బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. తెలంగాణలో హింసకు తావు లేదని.. ఇప్పటికీ అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టులంతా ఆయుధాలను వదిలేస్తే వారు లేవనెత్తే అంశాలపై చర్చించేందుకు ప్రభుత్వం అన్నివేళలా సిద్ధంగా ఉంటుందని స్పష్టంచేశారు. జనజీవన స్రవంతిలో కలిసిన మావోయిస్టులు తెలంగాణ పునర్నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఉమ్మడి రాష్ట్రచరిత్రలో మునుపెన్నడూ లేనిరీతిలో 130 మంది మావోయిస్టులు 124 ఆయుధాలతో సీఎం సమక్షంలో శనివారం లొంగిపోయారు. ఈ సందర్భంగా హైదరాబాద్ ఐసీసీసీలో నిర్వహించిన సమావేశంలో డీజీపీ శివధర్‌రెడ్డి, అదనపు డీజీపీలు విజయ్‌కుమార్(ఇంటెలిజెన్స్), అనిల్‌కుమార్(గ్రేహౌండ్స్), ఎస్ఐబీ చీఫ్ సుమతితో కలిసి లొంగిపోయిన మావోయిస్టులకు తక్షణసాయం అందించారు. వారు అప్పగించిన ఆయుధాలను పరిశీలించారు. ఈ నేపథ్యంలో సీఎం మాట్లాడుతూ... "ఎంతటి సమస్యకైనా చర్చలే పరిష్కారం అనేది ప్రస్తుతం ప్రపంచం అనుసరిస్తున్న మార్గం. అందుకే ఇప్పటికీ అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టులు ఆయుధాలను వీడాలని సీఎంగా పిలుపునిస్తున్నా. ఎలాంటి అంశాలపైనైనా చర్చించేందుకు సిద్ధంగా ఉన్నాం. కొద్దిరోజుల క్రితం లొంగిపోయిన దేవ్‌జీలాంటి అగ్రనేతలు నాతో సుదీర్ఘంగా చర్చించారు. తాము చెప్పే అంశాలను పరిగణనలోకి తీసుకుంటే గణపతి సహా మిగిలిన నేతలందరికీ ప్రభుత్వ స్పందనను తెలియజేస్తామని చెప్పారు. ప్రాణహాని జరగకుండా సమస్యల్ని పరిష్కరించగలిగితే దేశంలో సీపీఐ(ఎంఎల్)ని రద్దు చేస్తామన్నారు. వారి ఆవేదనను రాష్ట్ర ప్రభుత్వం అర్థం చేసుకుంది. కేంద్రం పరిధిలోని అంశం కావడంతో నేనే స్వయంగా అమిత్‌షాను కలిసి చర్చిస్తే ఆయన సానుకూలంగా స్పందించారు. లొంగుబాట్ల విషయంలో తెలంగాణకు పూర్తి స్వేచ్ఛనిచ్చారు. ఈ క్రమంలోనే బుల్లెట్ ద్వారా కాకుండా బ్యాలట్ ద్వారానే సమస్యలకు పరిష్కారం లభిస్తుందని నమ్మి భారీసంఖ్యలో మావోయిస్టులు లొంగిపోయారు" అని అన్నారు.

"లొంగిపోయిన ప్రతిఒక్కరికీ ప్రత్యేకంగా ఆరోగ్యభద్రత కార్డులు ఇస్తాం. నిమ్స్‌లాంటి ఆసుపత్రుల్లో మెరుగైన చికిత్స అందించే బాధ్యతను ప్రభుత్వమే తీసుకుంటుంది. అందరికీ ఇందిరమ్మ ఇల్లు కట్టిస్తాం. అవసరమైతే స్వగ్రామంలోనే ఇల్లు నిర్మించుకునేందుకు ప్రభుత్వస్థలం సమకూరుస్తాం. గ్రామాల్లో భూముల కొరత దృష్ట్యా వ్యవసాయ భూమి విషయంలో మాత్రం స్పష్టమైన హామీ ఇవ్వలేను. మాజీలకు పునరావాసం విషయంలో రాష్ట్ర ప్రభుత్వమే సొంతంగా నిర్ణయాలు తీసుకునే వెసులుబాటును అమిత్‌షా కల్పించారు. మీ బాగోగుల బాధ్యత పూర్తిగా మాదే. మీకు ఆత్మగౌరవంతో కూడిన జీవనవిధానం అందించే పూచీ మాది. అయితే ఇవన్నీ ఏర్పాటు చేసే ముందు రాష్ట్రం చెబుతున్న ఒకే అంశం... తెలంగాణ గడ్డపై హింస కుదరదు. హింసకు పాల్పడినా, ఆయుధాలను చెంత పెట్టుకున్నా చట్టపరంగా చర్యలు తప్పవని అమిత్‌షా స్పష్టంచేశారు" అని వెల్లడించారు. "ఆయుధంతో సాధించేది ఏమీ లేదు. ఎల్‌టీటీఈ లాంటి సంస్థలకే విషాద ముగింపు తప్పలేదు. గాంధీమార్గమే మా మార్గం. అందుకే మిగిలిన మావోయిస్టులు ఆయుధాలను అప్పగించి అవసరమైన చర్చలు జరపండి. నక్సలిజంలో కొండపల్లి సీతారామయ్య తర్వాత అంత గుర్తింపు తెచ్చుకున్న వ్యక్తి గణపతి. 75 ఏళ్లుపైబడిన వయసులో ఆయన ఆరోగ్య పరిస్థితి బాగోలేదని పోలీస్ అధికారులు చెబుతున్నారు. గణపతి లొంగిపోతే ఆయన రక్షణ బాధ్యతను పూర్తిగా ప్రభుత్వమే తీసుకుంటుంది" అని అన్నారు.

లొంగిపోయిన మావోయిస్టులపై కేసుల ఎత్తివేతకు సంబంధించి మీడియా అడిగిన ప్రశ్నకు సీఎం స్పందిస్తూ... ఈ విషయంలో ఒక్కో కేసు వారీగా పరిశీలన చేయిస్తామన్నారు. నేరతీవ్రత దృష్ట్యా న్యాయపరిధిలో పరిశీలించాకే నిర్ణయం తీసుకుంటామన్నారు. అవసరమైతే కమిటీ ఏర్పాటు చేస్తామన్నారు. మావోయిస్టులపై నిషేధం ఎత్తివేస్తారా..? అన్న ప్రశ్నకు మావోయిస్టులే లేనప్పుడు నిషేధం ఊసే లేదన్నారు. మావోయిస్టులు లొంగిపోయేందుకు విధించిన మార్చి 31 తుదిగడువును పెంచే ఆలోచన ఉందా...? అంటే ఎంతమాత్రం లేదని స్పష్టంచేశారు. ఒకవేళ మాజీలు కాంగ్రెస్‌లో చేరాలనుకుంటే గాంధీభవన్‌కు వెళ్లి ఎప్పుడైనా పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌ను కలవొచ్చని సూచించారు.

మావోయిస్టుల లొంగుబాటులో తెలంగాణ పోలీసులు వ్యవహరించిన తీరును సీఎం రేవంత్‌రెడ్డి అభినందించారు. డీజీపీ శివధర్‌రెడ్డి, ఇంటెలిజెన్స్ చీఫ్ విజయ్‌కుమార్, గ్రేహౌండ్స్ అదనపు డీజీపీ అనిల్‌కుమార్, స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్(ఎస్ఐబీ) చీఫ్ సుమతిలను ప్రశంసించారు.

# ఇరాన్-అమెరికా.. ఢీ అంటే ఢీ!

(స్పెషల్ టాస్క్ బ్యూరో) న్యూఢిల్లీ/హైదరాబాద్, మార్చి 7:
పశ్చిమాసియాలో ఎనిమిదో రోజు ఘర్షణలు మరింత తీవ్రమయ్యాయి. ఇరాన్‌లోని పలు సైనిక స్థావరాలే లక్ష్యంగా 80 యుద్ధ విమానాలు, 230 బాంబులతో ఇజ్రాయెల్ విరుచుకుపడింది. దీనికి దీటుగా గల్ఫ్ దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలే లక్ష్యంగా ఇరాన్ ప్రతిదాడులు జరిపింది. దీంతో పశ్చిమాసియా అగ్ని గుండాన్ని తలపిస్తున్నది. మరోవైపు, ఇరాన్‌లోని పౌరుల నివాసాలు, పాఠశాలలే లక్ష్యంగా ఇజ్రాయెల్-అమెరికా దాడులకు పాల్పడుతున్నాయని ఇరానీయన్ రెడ్ క్రెసెంట్ సొసైటీ తెలిపింది. ఘర్షణలు ప్రారంభమైనప్పటి నుంచి ఇరాన్‌లో 1,300 మంది మరణించినట్టు సమాచారం. మరోవైపు చమురు రవాణాకు అత్యంత కీలకమైన హార్మూజ్ జలసంధి విషయంలో ఇరాన్, అమెరికా మధ్య మాటల తూటాలు పేలుతున్నాయి.

ఇజ్రాయెల్-అమెరికా దాడులు ఇలా..

ఇరాన్‌పై శనివారం అమెరికా-ఇజ్రాయెల్ డ్రోన్లు, క్షిపణులు విరుచుకుపడ్డాయి. 80 యుద్ధ విమానాలు, 230 బాంబులతో శనివారం వేకువజామున ఇరాన్‌లోని పలు సైనిక స్థావరాలను ధ్వంసం చేసినట్టు ఇజ్రాయెల్ ప్రకటించింది. అలాగే, ఇరాన్‌లోని మెహ్రాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంతో పాటు పలు ప్రాంతాలపై ఇజ్రాయెల్ భీకర దాడులు చేసింది. తూర్పు లెబనాన్‌లోని నబీచిట్ నగరంపై ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో 26 మంది మరణించారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ సంచలన వ్యాఖ్యలు చేశారు.

ఇరాన్‌పై ఇప్పటివరకూ చేసిన దాడుల కంటే అతిపెద్ద దాడి చేయడానికి తమ సైన్యం సిద్ధంగా ఉన్నట్టు ఆయన తెలిపారు. శనివారం ఇరాన్‌పై భీకర దాడులు జరుగబోతున్నట్టు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కూడా పేర్కొన్నారు. వాళ్లు చెప్పినట్టుగానే శనివారం ఇరాన్‌పై తీవ్రమైన దాడులు జరిగాయి. మరోవైపు, యుద్ధం నేపథ్యంలో ఇరాన్ వైపు ఇప్పటికే రెండు యుద్ధ విమాన వాహక నౌకలను పంపించిన అమెరికా.. తాజాగా మరో వాహక నౌకను పంపించింది. ఇంకోవైపు, యుద్ధం తీవ్రత పెరుగుతున్న క్రమంలో భారీ మొత్తంలో సైనిక ఆయుధాలు, మందుగుండు సామగ్రిని ఇజ్రాయెల్‌కు విక్రయించడానికి తమ ప్రభుత్వం ఆమోదం తెలిపినట్టు అమెరికా విదేశాంగశాఖ ప్రకటించింది.

పౌరుల నివాసాలే లక్ష్యం

గడిచిన 8 రోజుల్లో ఇరాన్‌లోని పౌరుల నివాసాలు, స్కూల్స్ లక్ష్యంగా అమెరికా-ఇజ్రాయెల్ దళాలు భీకర దాడులు జరిపాయని ఇరానీయన్ రెడ్ క్రెసెంట్ సొసైటీ తెలిపింది. 5,535 నివాస భవనాలు, 1,041 వాణిజ్య భవనాలు, 14 మెడికల్ సెంటర్లు, 65 పాఠశాలలు, 13 రెడ్ క్రెసెంట్ కేంద్రాలపై అమెరికా-ఇజ్రాయెల్ దాడులు జరిపినట్టు వెల్లడించింది.

ఇరాన్ ప్రతీకార దాడులు ఇలా...

ఇరాన్ కూడా ప్రతీకార దాడుల తీవ్రతను పెంచింది. అబుధాబిలోని జాయెద్ అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలో ఇరాన్ భారీ పేలుళ్లు జరిపింది. దీంతో ఆ ప్రాంతంలో పెద్దయెత్తున పొగ వ్యాపించింది. దుబాయ్ ఎయిర్‌పోర్ట్ సమీపంలో దాడులు జరగ్గా.. ఎయిర్‌పోర్ట్‌లో ల్యాండ్ కావాల్సిన కొన్ని విమానాలు గాలిలో చక్కర్లు కొట్టినట్టు సమాచారం. పలు విమానాలను రద్దు చేశారు. 300 మిలియన్ డాలర్లతో నిర్మించిన జోర్డాన్‌లోని అమెరికా థాడ్ రాడార్ సిస్టమ్‌ను ఇరాన్ పేల్చేసింది. యూఏఈలోని అమెరికా ఎయిర్ కాంబాట్ సెంటర్‌తో పాటు మరో శాటిలైట్ కమ్యూనికేషన్ హబ్‌ను పేల్చేసినట్టు ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ (ఐఆర్‌జీసీ) వెల్లడించింది. బహ్రెయిన్ తన గగనతలాన్ని మూసేయగా విమాన సర్వీసులు రద్దయ్యాయి. మరోవైపు ఖతార్‌లోని భారత పౌరులకు అక్కడి ఎంబసీ కీలక సూచన జారీ చేసింది.

దాడులు చేయం.. అయితే..

అమెరికా-ఇజ్రాయెల్ దాడులకు ప్రతీకారంగా గల్ఫ్ దేశాలపై ఇరాన్ విరుచుకుపడుతున్నది. ఈ క్రమంలో కీలక పరిణామం చోటుచేసుకొన్నది. దాడులకు సంబంధించి గల్ఫ్ దేశాలకు ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ క్షమాపణలు తెలియజేశారు. ఇకపై గల్ఫ్ దేశాలపై తమ నుంచి ఎటువంటి దాడి జరుగబోదని హామీనిచ్చారు. అయితే, గల్ఫ్ దేశాలు తమపై ప్రత్యక్ష దాడికి దిగితే, తామూ అదే రీతిలో స్పందిస్తామని హెచ్చరించారు. ఈ మేరకు తమ ప్రభుత్వం నిర్ణయం తీసుకొన్నదని వెల్లడించారు. ఇరాన్ అధ్యక్షుడి క్షమాపణల ప్రకటనపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యంగ్యంగా స్పందించారు. అమెరికా, ఇజ్రాయెల్ నిరంతర దాడులతో ఇరాన్ తోక ముడిచిందని ఎద్దేవా చేశారు. ఇకపై ఇరాన్ గల్ఫ్ దేశాలపై బెదిరింపులకు పాల్పడబోదన్నారు.

వాళ్లను అప్పగించండి

ఇరాన్‌కు చెందిన ఐరిస్ దేనా యుద్ధనౌక ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడిన వారిని తిరిగి ఇరాన్‌కు పంపొద్దని శ్రీలంక ప్రభుత్వంపై అమెరికా ఒత్తిడి తీసుకొచ్చింది. అలాగే, శ్రీలంక కస్టడీలో ఉన్న ఇరాన్ రెండో నౌకలోని సిబ్బందిని కూడా వారి స్వదేశానికి పంపించవద్దని చెప్పినట్టు సమాచారం. ఈ మేరకు మీడియాలో కథనాలు వచ్చాయి. అయితే, దీనిపై శ్రీలంక స్పందన ఎలా ఉందన్న విషయం తెలియరాలేదు.

వచ్చేయండి.. వెయిటింగ్

హార్మూజ్ గుండా నౌకల రవాణా విషయంలో అమెరికా-ఇరాన్ ఢీ అంటే ఢీ అన్నట్టు చేస్తున్న ప్రకటనలు ఉద్రిక్తతలను మరింత పెంచుతున్నాయి. పశ్చిమ దేశాలను ఇరకాటంలో పెట్టడమే లక్ష్యంగా హార్మూజ్ జలసంధిని మూసివేస్తున్నట్టు ఇటీవల ఇరాన్ ప్రకటించింది. జలసంధి గుండా ఏ నౌక ప్రయాణించినా కాల్చేస్తామంటూ హెచ్చరించింది. దీంతో ప్రపంచ దేశాలు ఆందోళనలో పడ్డాయి. దీన్ని గమనించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. వివిధ దేశాల వాణిజ్య నౌకలకు తాము భద్రత కల్పిస్తామంటూ ప్రకటించారు.

జలసంధి మీదుగా చమురు నౌకలకు రక్షణగా వెళ్లేందుకు తమ దళాలు సిద్ధమవుతున్నాయని అమెరికా ఇంధనమంత్రి క్రిస్ రైట్ తాజాగా ప్రకటించారు. దీనిపై ఇరాన్ స్పందించింది. హార్మూజ్ జలసంధి వద్ద అమెరికా దళాలను ఎదుర్కొనేందుకు వేచిచూస్తున్నట్టు ఐఆర్‌జీసీ తెలిపింది. అమెరికా ఏదైనా నిర్ణయం తీసుకొనే ముందు 1987 లో సూపర్ ట్యాంకర్ బ్రిడ్జ్‌టన్‌కు జరిగిన ప్రమాదాన్ని గుర్తు చేసుకోవాలని ఐఆర్‌జీసీ ప్రతినిధి అలీ మహ్మద్ నైనీ హెచ్చరించారు. 1987 లో కువైట్‌కు చెందిన బ్రిడ్జ్‌టన్ ట్యాంకర్ పర్షియన్ గల్ఫ్ మీదుగా వెళ్తుండగా.. అమెరికా నావికాదళం రక్షణగా నిలిచింది. అయితే ఐఆర్‌జీసీ చేసిన దాడిలో ఆ నౌక దెబ్బతిన్నది. ఆ ఉదంతాన్ని గుర్తు చేసిన నై నీ.. అమెరికాను పై విధంగా హెచ్చరించారు.

## నకిలీ విజయ బ్రాండ్లపై కఠిన చర్యలు తీసుకుంటాం

### తెలంగాణ విజయ డెయిరీ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి

**ఏ ఎం న్యూస్ ఓయూ:**



మార్కెట్‌లో పెరుగుతున్న కల్తీ పాలు, నకిలీ బ్రాండ్ పేర్ల దుర్వినియోగంపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ విజయ డెయిరీ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి సూచించారు. కల్తీ పాలు, నెయ్యి వంటి పాల ఉత్పత్తులు ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. లాలాపేటలోని విజయ భవన్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో తెలంగాణ విజయ డెయిరీ మేనేజింగ్ డైరెక్టర్ కే. చంద్రశేఖర్ రెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. మార్కెట్‌లో తెలంగాణ విజయ పాల ఉత్పత్తుల పేరుతో నకిలీ బ్రాండ్లు విక్రయిస్తూ వినియోగదారులను గందరగోళానికి గురిచేస్తున్నారని చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి తెలిపారు. కొన్ని సంస్థలు రైతుల నుంచి పాలు సేకరించకుండా విజయ బ్రాండ్ పేరుతో పాలు, పాల ఉత్పత్తులు విక్రయిస్తున్నాయని ఆయన ఆరోపించారు. ఇటువంటి నకిలీ ఉత్పత్తులు వినియోగదారుల ఆరోగ్యానికి హానికరమని చెప్పారు. ఈ అంశంపై ప్రభుత్వం ద్వారా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.మేఘన ఫుడ్స్‌కు ఫ్రాంచైజ్‌ను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇచ్చిందని, కొన్ని పాల ప్యాకెట్లపై వివరాలు తెలుసుకునేందుకు స్కాన్ చేస్తే ప్రైవేట్ కంపెనీ వివరాలు కనిపిస్తున్నాయని తెలిపారు. దీంతో వినియోగదారుల్లో అయోమయం నెలకొంటోందన్నారు.ఇటీవల పక్క రాష్ట్రాల్లో నకిలీ పాల కలకలం చోటుచేసుకున్న నేపథ్యంలో తెలంగాణలో కూడా అలాంటి పరిస్థితులు రాకుండా ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. నిజమైన తెలంగాణ విజయ పాలు మరియు పాల ఉత్పత్తులను మాత్రమే కొనుగోలు చేయాలని కోరారు.ప్రస్తుతం బ్రాండ్ విభజన ఇంకా పూర్తి కాలేదని, నాణ్యత విషయంలో ఎఫ్ఎస్ఎస్ఏఐ పర్యవేక్షణ అవసరం ఉందన్నారు. హైదరాబాద్ నగరంలో ప్రతినెల సుమారు 100 టన్నుల నెయ్యి విక్రయిస్తున్నట్లు తెలిపారు. వినియోగదారుల ఆరోగ్య రక్షణతో పాటు పాల ఉత్పత్తుల నాణ్యతను కాపాడేందుకు సంస్థ పలు చర్యలు తీసుకుంటోందని గుత్తా అమిత్ రెడ్డి వెల్లడించారు.

## ఆడబిడ్డలకు కేసీఆర్ ఆదరణ..

**హైదరాబాద్ సిటీబ్యూరో/కొండాపూర్, మార్చి 7 :**
బీఆర్ఎస్ హయాంలో మహిళా సాధికారతకు పెద్దపీట వేశామని, స్థానిక సంస్థల్లో 50శాతం రిజర్వేషన్లు కల్పించామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని మాజీ కార్పొరేటర్ నవతారెడ్డి ఆధ్వర్యంలో శనివారం గ్రేటర్ హైదరాబాద్‌లోని చందానగర్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి మాజీ మంత్రులు సబితాఇంద్రారెడ్డి, సునీతాలక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే కృష్ణారావుతో కలిసి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆడబిడ్డలందరికీ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన కేటీఆర్.. యువతులు, మహిళలు స్వయంశక్తితో, ఆర్థిక స్వాతంత్ర్యం సాధించే దిశగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఆడబిడ్డలకు ఆర్థిక స్వావలంబనే అసలైన గౌరవం ఇస్తుందన్నారు.

ఎవరి మీద ఆధారపడకుండా, ఉద్యోగం, వ్యాపారం చేసే స్థాయికి ఎదగాలని, అప్పుడే సమాజంలో గౌరవం, గుర్తింపు ఉంటుందని చెప్పారు. రాబోయే రోజుల్లో మహిళా రిజర్వేషన్లు అమల్లోకి రానున్న నేపథ్యంలో విద్యావంతులు, సామాజిక స్థితిగతులపై అవగాహన ఉన్న మహిళలు రాజకీయాల్లోకి రావాలని పిలుపునిచ్చారు. కేసీఆర్ పాలనలో మహిళా సంక్షేమానికి వినూత్న కార్యక్రమాలు అమలు చేశారని గుర్తుచేశారు. ఆడబిడ్డల ఆశీస్సులతో కేసీఆర్ ప్రభుత్వం మళ్లీ వస్తుందని, మరిన్ని అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో విశేష సేవలందించిన సోషల్ వర్కర్స్, ఆర్టిస్టులు, జర్నలిస్టులు, శానిటేషన్ వర్కర్లు, ప్రజాప్రతినిధులకు కేటీఆర్ పురస్కారాలను అందజేశారు. అనంతరం చందానగర్‌లో బీఆర్ఎస్ పార్టీ నూతన కార్యాలయాన్ని కలిసి కేటీఆర్ ప్రారంభించారు. నేడు తెలంగాణ భవన్‌లో మహిళాదినోత్సవం.. హైదరాబాద్‌లోని బీఆర్ఎస్ కేంద్ర కార్యాలయమైన తెలంగాణ భవన్‌లో ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నారు.

## నేడు భారత్, న్యూజిలాండ్ తుది పోరు

**అహ్మదాబాద్:**
ప్రతిష్టాత్మక టీ20 ప్రపంచకప్‌లో కీలక సమరానికి రంగం సిద్ధమైంది. అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న క్షణం రానే వచ్చింది. నెల రోజుల నుంచి అభిమానులను అలరిస్తున్న పొట్టి ప్రపంచకప్‌లో ఫైనల్ ఫైట్‌కు సమయం ఆసన్నమైంది. మరికొన్ని గంటల వ్యవధిలో ఆతిథ్య భారత్, న్యూజిలాండ్ మధ్య తుది పోరు జరుగనుంది. 20 జట్ల సమాహారంతో మొదలైన వరల్డ్‌కప్ ఆఖరి అంకానికి చేరుకుంది. డిఫెండింగ్ చాంపియన్ హోదాలో ముచ్చటగా మూడోసారి కప్‌ను ముద్దాడేందుకు సూర్యకుమార్‌యాదవ్ నేతృత్వంలోని టీమ్‌ఇండియా కల సాకారం చేసుకోవాలని చూస్తుంటే.. సుదీర్ఘ కాలంగా అందని ద్రాక్షగానే మారిన వరల్డ్‌కప్ టైటిల్ కోసం కివీస్ చకోర పక్షిలా వేచిచూస్తున్నది. ప్రపంచంలోని రెండు మేటి జట్ల మధ్య పోరు కోట్లాది మంది ఫ్యాన్స్‌ను అలరించడం ఖాయంగా కనిపిస్తుండగా, ఆఖరి పోరాటానికి భారత్, న్యూజిలాండ్ అస్త్రశస్త్రాలతో సిద్ధమయ్యాయి.

మెగాటోర్నీలో దక్షిణాఫ్రికా చేతిలో ఓటమి మినహాయిస్తే ఎదురుపడ్డ ప్రత్యర్థినల్లా చిత్తుచేసిన టీమ్‌ఇండియా..ఫైనల్లోనూ కివీస్ భరతం పట్టాలని చూస్తున్నది. పొట్టి ఫార్మాట్‌లో గత మూడేండ్లుగా తిరుగులేని ఆధిపత్యం చెలాయిస్తున్న భారత్ రికార్డు స్థాయిలో మూడోసారి టైటిల్ ఒడిసిపట్టుకునేందుకు తహతహలాడుతున్నది. సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్సీలో ఇప్పటి వరకు సిరీస్ కోల్పోని టీమ్‌ఇండియా అదే పంథాను కొనసాగించేందుకు అడుగులు వేస్తున్నది. అయితే కివీస్ రూపంలో బలమైన ప్రత్యర్థి ఉండటం టీమ్‌ఇండియాకు ఒకింత ప్రతికూలంగా కనిపిస్తున్నది. దీనికి తోడు 2023 వన్డే ప్రపంచకప్ ఫైనల్ అభిమానుల కండ్ల ముందు కదలాడుతున్నది. రోహిత్‌శర్మ కెప్టెన్సీలో అపజయమెరుగని టీమ్‌ఇండియా టైటిల్ ఆశలపై ఆసీస్ నీళ్లు గుమ్మరించిన క్షణాలు ఫ్యాన్స్ మదిలో మెదులుతూనే ఉన్నాయి. అహ్మదాబాద్‌లో నాడు ఎదురైన ఓటమికి ఇప్పటికీ బాధపడుతున్న సగటు అభిమానికి పొట్టి ప్రపంచకప్ విజయం ఊరటనిచ్చేలా ఉండాలని ఆశిస్తున్నారు.

మొతెరా స్టేడియంలో వ్యక్తిగత రికార్డుల పరంగా ఢోకా లేకపోయినా జట్టు పరంగా భారత్‌కు చేదు అనుభవాలు ఎదురయ్యాయి. ఈ నేపథ్యంలో పలు సెంటిమెంట్లు.. గతంలో బస చేసిన హోటల్‌కు బదులు కొత్త దాంట్లో దిగడం, ఎర్ర, నల్లని మట్టితో పిచ్ తయారి లాంటి అంశాలు ఫ్యాన్స్‌కు ఆసక్తి కల్గిస్తున్నాయి. కానీ అనిశ్చితికి మారుపేరైన టీ20ల్లో ఆవగింజంత అదృష్టం లేకపోతే కలల కప్ దక్కడం కష్టం. ఇదిలా ఉంటే 2000లో నాకౌట్ టోర్నీ మినహాయిస్తే ఇప్పటి వరకు కివీస్ ఖాతాలో వరల్డ్‌కప్ టైటిల్ లేకపోవడం వారిని కలవరపెడుతున్నది. దశాబ్దాలుగా సెమీస్ టీమ్‌గా ముద్రపడ్డ కివీస్ దాన్ని చెరిపేసుకుని కొత్త చరిత్ర వైపు అడుగులు వేయాలని చూస్తున్నది. ఇరు జట్ల కూర్పును గమనిస్తే తమదైన రోజున మ్యాచ్‌ను శాసించే ప్లేయర్లకు కొదువ లేదు.

అభిషేక్, వరుణ్‌పై నజర్:

మెగాటోర్నీ ముందు వరకు అభిషేక్‌శర్మ, వరుణ్ చక్రవర్తి సూపర్ ఫామ్‌లో ఉన్నారు. అభిషేక్ ఆకాశమే హద్దుగా చెలరేగుతూ పరుగుల వరద పారిస్తే..మిస్టరీ స్పిన్‌తో వరుణ్ వికెట్ల వేట కొనసాగించాడు. కానీ మెగాటోర్నీలో వీరిద్దరి ప్రదర్శన ఘోరంగా తయారైంది. టీ20 ఫార్మాట్‌లో నంబర్‌వన్ ర్యాంక్‌లతో అడుగుపెట్టిన అభిషేక్, వరుణ్ అంచనాలు అందుకోవడంలో ఘోరంగా విఫలమయ్యారు. హ్యాట్రిక్ డక్‌లతో అభిషేక్ నిరుత్సాహ పరిస్తే..వరుణ్ మిస్టరీ కోడ్‌ను డీకోడ్ చేసిన బ్యాటర్లు వీరబాదుడు బాదుతున్నారు. దీంతో కివీస్‌తో ఫైనల్లో వీరిద్దరు ఎలా రాణిస్తారనేది ఆసక్తికరంగా మారింది. అభిషేక్ స్థానానికి ఇబ్బంది లేకపోయినా..వరుణ్ బెర్తును కుల్దీప్‌యాదవ్ లేదా సిరాజ్‌తో భర్తీ చేసేందుకు మేనేజ్‌మెంట్ ఆలోచిస్తున్నది. అంతకుమించి మార్పులేమి ఉండకపోవచ్చు. యార్కర్‌కింగ్ బుమ్రా మరోమారు సత్తాచాటితే కలల కప్ భారత్ ఖాతాలో చేరినట్లే. మరోవైపు కివీస్ ఒకటి లేదా రెండు మార్పులతో బరిలోకి దిగే చాన్స్ ఉంది.



# మహిళల భద్రతను సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరు భావించాలి

## పీసీసీ సభ్యులు, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం

ఏ ఎం న్యూస్, కూకట్పల్లి : ఇబ్బందుల్లో ఉన్న మహిళల కోసం ' స్టాండ్ విత్ హర్ ' అనే నినాదం తీసుకొని వారికి అండగా నిలబడాలనీ పీసీసీ సభ్యులు, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం పేర్కొన్నారు. తెలంగాణ మహిళా భద్రతా విభాగం ఆధ్వర్యంలో స్టాండ్ విత్ హర్ అనే విన్నూత కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు కూకట్ పల్లి జేఎన్టీయూ క్యాంపస్ కి విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు ఎనుముల రేవంత్ రెడ్డికి నియోజకవర్గ ఇంచార్జి బండి రమేష్, పీసీసీ సభ్యులు, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగంలు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ సాంకేతికత పెరిగిన తర్వాత సోషల్ మీడియాలో మహి



ళలపై వేధింపులు పెరిగాయని, ఈ సందర్భంలో చట్టాల బలోపేతం, రక్షణ చర్యలతో పాటు మనల్ని మనం మనుషులుగా సంస్కరించుకుని బాధ్యతతో మెలగాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మహిళల భద్రతను సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరు భావించాలని అన్నారు. ప్రతి మహిళను మన ఇంటి ఆడబిడ్డగా భావించి, గౌరవించాలన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకోవడంతో మన బాధ్యత తీరిపోలేదు. మహిళల ప్రాధాన్య తను గుర్తించి, బాధ్యతలను అప్పగించడంలో ప్రజా ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుంది. ప్రజా ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు మహిళల పేరుతోనే అందిస్తున్నమని, రేషన్ కార్డుల నుంచి ఇందిరమ్మ ఇళ్ల వరకు మహిళల పేరుతో అందిస్తున్నాం అన్నారు. సోలార్ విద్యుత్ నుంచి ఆర్టీసీ అద్దె బస్సుల వరకు మహిళలను వ్యాపారవేత్తలుగా ప్రోత్సహిస్తున్నాం అన్నారు. తెలంగాణ రైజింగ్ 2047 విజన్ లక్ష్య సాధనలో మహిళల ముందడుగే కీలకం. మహిళలు ఆర్థిక ప్రగతి సాధించడంతోనే తెలంగాణ రాష్ట్రం 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చెందుతుంది. మహిళలకు సంపూర్ణ భద్రత కల్పించడంతోనే ఇవన్నీ నెరవేరుతాయి అన్నారు.

## ఘనంగా సంస్కార్ ప్లే ప్రైమరీ స్కూల్ వార్షికోత్సవ వేడుకలు

### ముఖ్యఅతిథిగా పాల్గొన్న బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు...

ఏ ఎం న్యూస్, కూకట్పల్లి :



సంస్కార్ ప్లే ప్రైమరీ స్కూల్ 14 'వ వార్షికోత్సవ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు హాజరయ్యారు. వివేకానంద నగర్ కాలనీ రీ – క్రియేషన్ క్లబ్ లో సంస్కార్ ప్లే ప్రైమరీ స్కూల్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన 14వ వార్షికోత్సవం గ్రాడ్యుయేషన్ వేడుక కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాజేశ్వరరావు విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షించి వారిని అభినందించారు. పాఠశాల యాజమాన్యం నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని అభినందిస్తూ, విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించడం ఎంతో అవసరమని తెలిపారు. అనంతరం ముఖ్యఅతిథి వడ్డేపల్లి రాజేశ్వరరావుని స్కూలు యాజమాన్యం ఉపాధ్యాయులు కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి మాట్లాడుతూ విద్య అనేది పిల్లల భవిష్యత్తుకు బలమైన పునాది అని, పాఠశాలలు పిల్లల్లో సాంస్కృతిక విలువలు, క్రమశిక్షణ, దేశభక్తిని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. అలాగే గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన చిన్నారులకు బహుమతులు అందజేసి అభినందనలు తెలియజేశారు. వారు ఉన్నత లక్ష్యాలను ఏర్పరుచుకుని జీవితంలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

## మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు

### - అరుణ్ కుమార్



ఏ ఎం న్యూస్, జూబ్లీహిల్స్ :పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలో ఉండే ముస్లిం సోదరుల కోసం ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందు ఆత్మీయత, మత సామరస్యానికి ప్రతీక అని బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు కాసాల అరుణ్ కుమార్ అన్నారు. శనివారం రహమత్ నగర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ మాజీ కార్పొరేటర్ మహమ్మద్ షఫీ నివాసంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో రహమత్ నగర్ వార్డ్ మెంబర్ అరుణ్ కుమార్ అతని మిత్రులతో కలిసి పాల్గొన్నారు. సామూహిక నమాజ్ అనంతరం మహమ్మద్ షఫీ కి ఉపవాస దీక్ష చేపట్టిన ముస్లింలకు దీక్ష ఫలహారాలు తినిపించి ఉపవాస విడిపించారు. ఈ సందర్భంగా అరుణ్ కుమార్ మాట్లాడుతూ.. ఇఫ్తార్ విందులలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. రంజాన్ మాస విశిష్టతను కొనియాడారు. అన్ని మతాలు చెప్పేది ఒక్కటేనని, మనషులంతా సోదర భావంతో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సురేందర్, నాగరాజ్, అర్షద్ భాయ్, గన్ను భాయ్, జగ్గు, అహ్మద్, తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

ఏ ఎం న్యూస్ ఓయూ:



అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం కీసరలోని శ్రద్ధ జూనియర్ స్ఫూర్తి డిగ్రీ కళాశాలలో కేక్ కట్ చేసి అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాలేజ్ ప్రిసిపాల్ మదర్ మాట్లాడుతూ.. మహిళల సాధికారత, సమానత్వం గూర్చి ప్రస్తావించారు. మహిళలకు సమాన అవకాశాలు కల్పించడం ద్వారా దేశం మరింత అభివృద్ధి సాధిస్తుందని అన్నారు. మహిళల ప్రతిభను ప్రోత్సహించడం సమాజ బాధ్యత అని, మహిళలు సాధించిన విజయాలు భవిష్యత్ తరాలకు ప్రేరణగా నిలుస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో రమేష్ గుప్తా వసంత. నాయకపు మాధురి, వెంకటేష్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## శ్రీ గౌరీ నీలకంఠేశ్వర స్వామి దేవాలయ కరపత్రాలను ఆవిష్కరించిన ఎమ్మెల్యే కృష్ణారావు...

ఏ ఎం న్యూస్, కూకట్పల్లి :



కూకట్పల్లి శాసనసభ్యులు మాధవరం కృష్ణారావు చేతులమీదుగా కెపిహెచ్బి కాలనీలోని ఏడవ ఫేసులో ఈనెల 25వ తేదీన ప్రతిష్టాపన జరగనున్న "శ్రీ గౌరీ నీలకంఠేశ్వర స్వామి దేవాలయ కరపత్రా లను శనివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘం నేత, బాలానగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ కాండూరి నరేందర్ ఆచార్య, కూకట్పల్లి బ్రాహ్మణ సంఘాల సమాఖ్య నేతలు సుబ్బారావు, పంచగం కేశవర, కమలాకర శర్మ ఎన్ మూర్తి గరికపాటి శర్మ సిఎన్ కుమార్ సుబ్బారావు గోపాలరత్నం తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆర్ట్స్ కాలేజ్ ప్రాంగణంలో విద్యార్థులు ఉత్సాహభరితమైన ఫ్లాష్‌మాబ్ ప్రదర్శన

ఏ ఎం న్యూస్ ఓయూ:



ఉస్మానియా విశ్వవిద్యాలయం బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం విద్యార్థులు నిర్వహిస్తున్న వార్షిక మేనేజ్‌మెంట్ ఫెస్ట్ "బ్లిట్జ్‌క్రిగ్ 2ఖ26" ఈ నెల 13, 14 తేదీలలో జరగనుంది. ఈ కార్యక్రమాన్ని ప్రచారం చేయడానికి శనివారం సాయంత్రం ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కాలేజ్ ప్రాంగణంలో విద్యార్థులు ఉత్సాహభరితమైన ఫ్లాష్‌మాబ్ ప్రదర్శన నిర్వహించారు. రేపు జరగనున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళలకు అంకితంగా ప్రత్యేక నృత్య ప్రదర్శన చేసి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఫ్లాష్‌మాబ్ కార్యక్రమం ఎంతో ఉత్సాహంగా సాగగా పెద్ద సంఖ్యలో విద్యార్థులు మరియు ప్రేక్షకులు చేరుకుని ఆసక్తిగా వీక్షించారు.



## శ్రీ ఆర్కే హాస్పిటల్, చావా ఫౌండేషన్ ఆధ్వర్యంలో 134వ ఉచిత మెగా వైద్య శిబిరం

ఏ ఎం న్యూస్ ఓయూ:



భువనగిరి పట్టణంలోని శ్రీ ఆర్కే హాస్పిటల్ , చావా ఫౌండేషన్ ఆధ్వర్యంలో 134వ ఉచిత మెగా వైద్య శిబిరం భువనగిరి పట్టణంలోని రూరల్ పోలీస్ స్టేషన్ నిర్వహించారు. ఈ ఉచిత మెగా వైద్య శిబిరం పోలీస్ సిబ్బందికి, అక్కడ ఉన్న స్థానిక వర్కర్లకు బేబీ షుగర్ బిఎండి పరీక్షలు నిర్వహించి తదనంతరం ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ , స్పోర్ట్స్ మెడిసిన్ స్పెషలిస్ట్ డాక్టర్ రోనక్ దినేష్ సోనీ చే ఉచిత కన్సల్టేషన్ నిర్వహించి డాక్టర్ సలహా మేరకు సిబ్బందికి అవసరమైన మందులు ఉచితంగా పంపిణీ చేశారు. డా. ఆర్థోపెడిక్ డాక్టర్ చే ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్థోపెడిక్ డాక్టర్ రోనాక్ దినేష్ సోనీ పోలీసు సిబ్బందికి కీళ్లవాతం వాటి లక్షణాలు, వాటి తీవ్రత తగ్గించుకోవడం కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ ఉచిత వైద్య శిబిరం నిర్వహించి తమ సిబ్బందికి మరి ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఎన్ చంద్రబాబు, ఎస్ఐ రూరల్ అనిల్ కుమార్ డాక్టర్ కి కృతజ్ఞతలు తెలియజేశారు.

## హైడ్రా పేదల జోలికి పోదని
# ప్రభుత్వ స్థలాలను కబ్జాల చేర నుండి కాపాడుతుంది

### టి పి సి సి ఉపాధ్యక్షులు బండి రమేష్

ఏ ఎం న్యూస్, కూకట్పల్లి :



హైడ్రా పేదల జోలికి వెళ్లదని ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసే వారి భరతం పడుతుందని టి పి సి సి ఉపాధ్యక్షులు బండి రమేష్ పేర్కొన్నారు. కేపిహెచ్బి వసంత నగర్ డివిజన్ లోని సాయి నగర్, సర్దార్ పటేల్ నగర్, భగత్సింగ్ నగర్, కాలనీలలో శనివారం కూకట్పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పిసిసి ఉపాధ్యక్షులు బండి రమేష్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు కాలనీవాసులు కాలనీ అసోసియేషన్స్ సభ్యుల తో కలిసి పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తక్షణమే సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని కోరారు. అనంతరం సర్దార్ పటేల్ నగర్ కాలనీలో వసంత నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పేదల పార్టీ అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా సమస్యలపై పోరాడుతున్నారని కొనియాడారు. హైడ్రా పేదలను నడ్డి విరిచేది కాదని ప్రభుత్వ స్థలాలను చెరువులను, నాలాలను, కబ్జా చేసే కబ్జా రాళ్లపై కొరడా నిలిపిస్తుందని కొని ఆడారు. పాదయాత్రను ఏర్పాటు చేసి సర్దార్ పటేల్ నగర్ లో వసంత నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ఏర్పాటుచేసిన మందలపు సాయిబాబు చౌదరిని కొనియాడారు. సాయిబాబు చౌదరి అనునిత్యం ప్రజలలో ఉండే మనిషని అన్నారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ గ్రేటర్ హైదరాబాద్ ఎలక్షన్లలో విజయ దుందవి మోవిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సత్యం శ్రీరంగం, షేరి సతీష్ రెడ్డి, గాలి బాలాజీ, డివిజన్ అధ్యక్షులు ప్రవీణ,కొప్పిశెట్టి దినేష్ కుమార్, దేశాల్, గంధం రాజు, గాదే శివ చౌదరి ,మైఖేల్, పొడుగు అప్పారావు, చావా శ్రీనివాసరావు, సిరిపురం మధు, కిలారి బాబు, రామకృష్ణ గారు తదితరులు పాల్గొన్నారు.



## పచ్చజెండా ఊపి ర్యాలీని ప్రారంభించిన లక్ష్మీ సుజాత

ఏ ఎం న్యూస్, జూబ్లీహిల్స్ :



శ్రీనగర్ కాలనీ గణపతి కాంప్లెక్స్ సమీపంలో ఉన్న గురుస్తాన్( పిరమిడ్ ) బ్రాంచ్ నుండి అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా అహింస ధ్యానపచార ర్యాలీ, ధ్యాన మహిళా దినోత్సవం ర్యాలీని పచ్చ జెండా ఊపి ప్రారంభించారు శ్రీనగర్ కాలనీ వెంకటేశ్వర స్వామి ఆలయ మాజి అధ్యక్షురాలు సోషల్ వర్కర్,అక్క అని పిలిస్తే నేనున్నా అని పిలికే లక్ష్మీ సుజాత. ఈ ర్యాలీ గణపతి కాంప్లెక్స్ నుండి అమీర్పేట్ నాగార్జున కమిటీ హాల్ వరకు కొనసాగింది ఈ కార్యక్రమం శనివారం మధ్యాహ్నం నిర్వహించారు. ఈ ర్యాలీలో మహిళలు దాదాపుగా 60 నుంచి 70 మంది పాల్గొన్నారు. నాగేంద్ర పీఠం (ఫౌండర్) సూచనలతో మీనా( కో ఫౌండర్ ) సమక్షంలో లక్ష్మి ( కోర్ మెంబర్ ) ఆదేశాలను పాటిస్తూ శ్రీనివాస్( కోర్ మెంబర్ ) వెన్నెల( కోర్ మెంబర్ ), లోకేష్ ( కోర్ మెంబర్ ), శాఖాహార లక్ష్మి తో పాటు గణపతి కాంప్లెక్స్ స్థానికురాలు నిర్మల పాల్గొన్నారు లక్ష్మీ మాట్లాడుతూ ప్రజలు మాంసాహారం మారాలి శాఖాహారం చేపట్టాలి అని అన్నారు. లక్ష్మీ సుజాత మాట్లాడుతూ జీవ హింస మహా పాపం అని అన్నారు. నిర్మల మాట్లాడుతూ సత్యమేవ జయతే, సమాజం సత్యం వైపు రావాలని అన్నారు. మీనా మాట్లాడుతూ అహింస పరమో ధర్మం అని అన్నారు ప్రతి ఒక్కరూ మాంసాహారం మానేసి శాకాహారం తీసుకోవాలని తెలిపే ఉద్దేశమే ఈ కార్యక్రమం అని అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళలు శాకాహారం తీసుకోవాలి అని నినాదాలు ఇస్తూ అమీర్పేట్ నాగార్జున కమిటీ హాల్ వైపు కి కదిలారు.

## మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే వి.నవీన్ యాదవ్..

ఏ ఎం న్యూస్, జూబ్లీహిల్స్ :



చరిత్ర ప్రకారం 20వ శతాబ్దంలో ఉత్తర అమెరికా, యూరప్లలో కార్మిక ఉద్యమాల నుండి మహిళా దినోత్సవం ప్రారంభమైంది. ఈ అంతర్జాతీయ మహిళా దినోత్సవం ప్రతి సంవత్సరం మార్చి ఎనిమిదో తారీకు ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటారు. ఇది మహిళల హక్కులు, గౌరవాన్ని పెంచేలా మహిళ ప్రామిక ఉద్యమాల నుండి ఉద్భవించింది. అటువంటి సాంప్రదాయాన్ని కొనసాగిస్తూ మహిళలందరికీ తమ్ముడిలా, అన్నల, కుటుంబ సభ్యుడిల ఉన్న జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి.నవీన్ యాదవ్ ఏ. ఎం న్యూస్ జూబ్లీహిల్స్ నియోజకవర్గ రిపోర్టర్ తో మాట్లాడుతూ ఆదివారం జరుపుకోబోయే అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలందరికీ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు ఏఎం న్యూస్ మీడియా ద్వారా తెలపాలని కోరారు.

## మహిళలందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన కొల్లూరి భరత్..

ఏ ఎమ్ న్యూస్ పటాన్చెరు:



చరిత్ర ప్రకారం 20వ శతాబ్దంలో ఉత్తర అమెరికా, యూరప్లలో కార్మిక ఉద్యమాల నుండి మహిళా దినోత్సవం ప్రారంభమైంది. ఈ అంతర్జాతీయ మహిళా దినోత్సవం ప్రతి సంవత్సరం మార్చి ఎనిమిదో తారీకు ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటారు మహిళల సామాజిక ఆర్థిక,రాజకీయ సాధనను గుర్తించి లింగ సమానత్వానికి ప్రోత్సహించడానికి ఈ అంతర్జాతీయ దినోత్సవం ను జరుపుకుంటారు ఇది మహిళల హక్కులు, గౌరవాన్ని పెంచేలా మహిళ ప్రామిక ఉద్యమాల నుండి ఉద్భవిం చింది. అటువంటి సాంప్రదాయాన్ని కొనసాగిస్తూ సంగారెడ్డి జిల్లా రామచంద్రపురం మండలం పటాన్చెరు నియోజకవర్గం నూతనంగా జిహెచ్ఎంసి లో కలిసిన తెల్లాపూర్ పరిధిలోని మాజీ కౌన్సిలర్, మంచి మనసున్న మనిషి, మహిళలందరికీ అన్నల, తమ్ముడిలా, కుటుంబ సభ్యుడిల ఉన్న కొల్లూరి భరత్ ఆదివారం జరుపుకోబోయే అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలందరికీ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు ఏఎం న్యూస్ మీడియా ద్వారా తెలిపారు.

## డప్పు కొట్టిన ఎర్రబెల్లి సతీష్ రావు...

ఏ ఎం న్యూస్ కూకట్పల్లి :



తన అభిమాన నాయకుడు బి.ఆర్.ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాకతో ఉత్సాహంతో తన అభిమానుల,నాయకుల మధ్య డప్పు కొట్టి కార్యకర్తల జోష్ పెంచిన శేర్లింగంపల్లి నియోజకవర్గం బిఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఎర్రబెల్లి సతీష్ రావు...

### నీడల నుండి నాయకత్వం వరకు...
## భారత మహిళల అప్రతిహత ఎదుగుదల

ఏ ఎం న్యూస్ ఓయూ:



భారతదేశంలో మహిళలు ఒకప్పుడు ఇంటి గోడల మధ్యనే పరిమితమయ్యే పరిస్థితి నుంచి నేడు దేశ అభివృద్ధిని ముందుకు నడిపించే నాయకులుగా ఎదిగారు. సామాజిక అడ్డంకులు, వివక్షలను ఎదుర్కొంటూ విద్య, శాస్త్రం, రాజకీయాలు, వ్యాపారం వంటి రంగాల్లో మహిళలు విశేష పురోగతి సాధిస్తున్నారు. 1848లో సావిత్రిబాయి పూలే బాలికల విద్యకు శ్రీకారం చుట్టడం నుంచి ప్రారంభమైన మహిళా సాధికారత ఉద్యమం, స్వాతంత్ర్యం తర్వాత రాజ్యాంగ హామీలతో మరింత బలపడింది. ఇందిరా గాంధీ, ప్రతిభా పాటిల్ వంటి నాయకులు రాజకీయాల్లో చరిత్ర సృష్టించగా, కల్పనా చావ్లా, టెస్సీ థామస్ వంటి మహిళలు శాస్త్ర సాంకేతిక రంగంలో భారత ప్రతిష్ఠను పెంచారు. వ్యాపార రంగంలో కూడా మహిళలు ముందుకు వస్తున్నారు. అయితే ఇంకా గ్రామీణ ప్రాంతాల్లో తక్కువ వేతనాలు, ఉద్యోగ అవకాశాల లోపం, మహిళలపై నేరాలు వంటి సవాళ్లు కొనసాగుతున్నాయి. మహిళలకు సమాన అవకాశాలు కల్పించేందుకు విద్య, భద్రత, ఉద్యోగాల్లో మరింత చర్యలు అవసరమని నిపుణులు సూచిస్తున్నారు. మహిళల ధైర్యం, సంకల్పం దేశ అభివృద్ధికి కీలకమని, సమానత్వంతో కూడిన సమాజ నిర్మాణానికి మహిళా సాధికారత అత్యంత అవసరమని విశ్లేషకులు పేర్కొంటున్నారు. – పార్వతి, ఎంఎస్‌డబ్ల్యూ విద్యార్థిని